క్లుప్తంగా

పండు మిరపకు గిరాకీ



వారపు సంతలో మిరపకాయల అమ్మకాలు

మునగపాక : స్థానిక వారపు సంతలో శుక్రవారం ఎండు మిరపకాయలకు గిరాకీ ఏర్పడింది. వేసవిలో నిల్వ కారం తయారీకి పండు మిర్చిని కొనుగోలు చేసేందుకు మహిళలు సమీపంలోని సంతలకు వెళ్తుంటారు. మెట్ట ప్రాంతాల్లో పండించిన పంటను ప్రస్తుతం స్థానికంగా జరిగే సంతల్లో అమ్మకాలు చేస్తుంటారు. మహిళలు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతారు. ఇదే అదనుగా కొంతమంది అమ్మకందార్లు ధరలను పెంచేశారు. సన్నాలు కుంచం రూ.120, పొట్టి మిరపకాయలు కుంచం రూ.140 వరకు అమ్మకాలు జరిగాయి. గతంలో కన్నా ధరలు ఎక్కువగా ఉన్నాయని మహిళలు వాపోతున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

మునగపాక : ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ కోరారు. మండలంలోని తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు



ఎంఈవోను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల : విద్యతోనే ఉన్నత భవిష్యత్తు సాధ్యమని ఎంఈవో పెన్నాడ అప్పారావు అన్నారు. బోడపాలెంలోని ఎంపీయూపీ స్కూల్లో శుక్రవారం ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో మాట్లాడుతూ పిల్లలకు మంచి విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులతోపాటు, తల్లిదండ్రులపైనా ఉందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంఈవో అప్పారావును, సర్పంచ్ ఎరుకునాయుడును ఉపాధ్యాయుల బృందం సత్కరించింది. హెచ్ఎం శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

చలివేంద్రాలతో సేవాభావం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నాగరాజు

రాంబిల్లి: చలివేంద్రాల ఏర్పాటుతో ప్రజల దాహార్తిని తీర్చడంతోపాటు, ప్రజల్లో సేవాభావాన్ని పెంపొందించవచ్చని జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంపీడీవో కేవీఎస్ కొండలరావు అన్నారు. హరిపురం కూడలి వద్ద పంచాయతీ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హరిపురం సచివాలయ కన్వీనర్ ధూళి అప్పారావు(బుజ్జి), సర్పంచ్ ధూళి దేవుడమ్మ, ఈవోపీఆర్డీ రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు రేఖా నందగోపాల్, ధూళి వెంకీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

అనకాపల్లిటౌన్ : ఆంధ్రా యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 22, 23 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్ మెన్ ఉమెన్ పవర్‌లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ కార్యదర్శి బద్రీనాథ్ శుక్రవారం అభినందించారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో జెర్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అర్హులైనవారందరికీ సంక్షేమ లబ్ధి–వలంటీర్లకు సూచన
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే జగన్ ప్రభుత్వ ధ్యేయమని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి(కన్నబాబురాజు) అన్నారు. శుక్రవారం యలమంచిలి మున్సిపాలిటీ 19వ వార్డు యర్రవరం సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల సంక్షేమ పథకాలు అందరికీ చేరుతున్నాయా? అంటూ లబ్ధిదారుల్ని అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు నివేదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాలు, పట్టణాల్లో సంక్షేమ పథకాలకు నోచుకోని లబ్ధిదారులను గుర్తించి వారి సమస్యలు పరిష్కరించడానికి వీలవుతోందన్నారు. గడప గడపకు కార్యక్రమానికి ప్రతి చోటా ప్రజలిస్తున్న మద్దతే, తమ పార్టీ పాలనకు కొలమానమన్నారు. జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి కూడా విశేష స్పందన లభిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పరంగా లబ్ధి పొందిన వారి ఆదరాభిమానులు మరింత సంక్షేమం దిశగా మమ్మల్ని నడిపిస్తున్నాయన్నారు. అనంతరం సచివాలయం సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు.



పట్టణంలోని 19వ వార్డులో లబ్ధిదారునికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



వలంటీర్ల సమావేశంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు

ఈ సమావేశంలో అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించి వారికి పథకాలను అందించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలపై సకాలంలో స్పందించి, వాటిని పరిష్కరించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, దూది నరసింహమూర్తి, గొర్లె వెంకట్, తహసీల్దారు రాణీ అమ్మాజీ, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, ఎంపీడీవో ప్రసాదరావు, సచివాలయ అధికారులు, వలంటీర్లు, మున్సిపల్ అధికారులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్ పాలనలో ముస్లింల సంక్షేమం

- ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : మండలంలోని తోటాడలో శుక్రవారం రాత్రి రంజాన్ మాసంలో భాగంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ముస్లింల ఐక్యతకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలన్నారు. ముస్లింల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ(తేజ), జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, పార్టీ నేత దొడ్డి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే రమణమూర్తి రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

ప్రతి కుటుంబానికీ సొంతిల్లు

కోటవురట్ల : రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకూ సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో వైఎస్సార్ జగనన్న కాలనీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి అన్నారు. కైలాసపట్నంలో శుక్రవారం హౌసింగ్ డే నిర్వహించారు. ప్రత్యేకాధికారి ఉదయశ్రీతో పాటు జెడ్పీటీసీ ఉమాదేవి లేఅవుట్‌లో పర్యటించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. సీఎం జగన్ ప్రతి కుటుంబానికీ సొంతిల్లు, పిల్లలకు బంగారు భవిష్యత్‌ను ఇచ్చేలా విద్య, మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా సంక్షేమ పథకాలను అందిస్తూ ఆసరాగా నిలుస్తున్నారని కొనియాడారు. ఇళ్లు కట్టుకునేందుకు స్థలాన్ని ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తున్నారని తెలిపారు. నిధులు సకాలంలో జమకావడంతో పాటు మెటీరియల్ కూడా అందుబాటులో ఉందని, ప్రతి ఒక్కరూ త్వరిత గతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పీఆర్ జేఈ వర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరుణ, ఈవోపీఆర్డీ ప్రేమ్‌సాగర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కైలాసపట్నం జగనన్న కాలనీలో పర్యటిస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి, అధికారులు

ప్రతి ఇంటి స్పందన.. మా నమ్మకం నువ్వే జగన్



పాయకరావుపేటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో బ్రోచర్లు అందిస్తున్న నాయకులు



చూచుకొండలో మా నమ్మకం నువ్వే జగన్‌లో సచివాలయ కన్వీనర్ అప్పలనాయుడు



ఎస్.రాయవరంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో కొణతాల శ్రీనివాసరావు

పాయకరావుపేట : మండలంలోని గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాల అమలు తీరుపై నాయకులు నిర్వహిస్తున్న ప్రచారానికి గ్రామాల్లో మంచి ఆదరణ దక్కుతోంది. ఇందులో భాగంగా జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావులు పార్టీ స్థానిక కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వెంటరాగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలపై ప్రచారం సాగించారు.

మండలంలోని 24 గ్రామాల్లోనూ స్థానిక నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల అభిప్రాయాలు స్వయంగా అడిగి తెలుసుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ పథకాల అమలుపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల అనుమతితో సీఎం జగన్ ఫొటోతో ఉన్న మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను వారిళ్లకు అతికిస్తున్నారు. సంక్షేమ పథకాలతో ముద్రించిన బ్రోచర్లను పంపిణీ చేస్తున్నారు. 8296082960 ఫోన్ నెంబరుకు లబ్ధిదారుల ఫోన్‌తో మిస్డ్‌కాల్ ఇచ్చి ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అభిప్రాయాలను తీసుకుంటున్నారు.

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని చూచుకొండ సచివాలయ కన్వీనర్ పెంటకోట అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చూచుకొండలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజల నుంచి 5 ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేశారు. సీఎం ఫొటోతో కూడిన స్టిక్కర్లను గోడలపై అతికించారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాలను గుర్తించి వచ్చే ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డికి అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హరేరామ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పూర్తి స్థాయిలో అందుతున్నాయా? ఏమైనా ఆటంకాలున్నాయా? గత ప్రభుత్వాలతో పోలిస్తే జగనన్న పాలన ఎలా ఉందంటూ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు పలువురుని ఆరా తీశారు. మండల కేంద్రం ఎస్.రాయవరంలో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగారు. ఎవరి నడిగినా జగన్‌బాబు వల్లే తామంతా సుఖంగా ఉన్నామని, మళ్లీ జగనే సీఎం కావాలని చెప్పడంతో పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతి అప్పారావు, మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు కుర్రా కాశి తదితరులు పాల్గొన్నారు.



కె.వెంకటాపురంలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అతికిస్తున్న జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్

కోటవురట్ల : మండలంలోని కె.వెంకటాపురంలో జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్ ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ప్రతి చోటా జగన్ పాలన బాగుందని, మళ్లీ సీఎంగా జగన్‌నే గెలిపించుకుంటామని ప్రజలు స్పష్టం చేశారు. రమేష్ మాట్లాడుతూ గతంలో సర్టిఫికెట్ కావాలన్నా, పింఛను కావాలన్నా నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, ఇపుడా దుస్థితి లేదన్నారు. సచివాలయ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని, విద్య, వైద్యం మెరుగుపడ్డాయన్నారు. ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌నే సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైల శ్రీరామమూర్తి, పార్టీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని డీఎల్‌డీవో మంజులవాణి సూచించారు. శుక్రవారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని గంటవానిపాలెం జగనన్న కాలనీని ఆమె సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన ప్రతీ నిరుపేదకు ఇళ్ల పట్టాతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమయ్యే ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోందన్నారు. కాలనీలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు అరిగా శ్రీను, కోన అప్పలరాజు, ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రమణ పాల్గొన్నారు.



జగనన్న కాలనీలో డీఎల్‌డీవో మంజులవాణి

సీతారాంపురంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల వలంటీర్లతో సీతారాంపురంలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం ప్రారంభమైనది. ఈ క్యాంపులో ఎన్ఎస్ఎస్ 2 యూనిట్‌కు చెందిన 50 మంది వలంటీర్లు వారం రోజుల పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పి.వెంకటకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు మాట్లాడుతూ వారం రోజుల పాటు మద్యనిషేధం, మెరుగైన జీవనశైలి, వ్యాధుల నివారణ, కంటి వైద్య శిబిరం, స్వచ్ఛభారత్, మొక్కలు నాటడం, కోవిడ్ నిబంధనలు పాటించడం, సాధికారిక విద్య, ఉపాధి లేని యువతపై సర్వే తదితర కార్యక్రమాలను వలంటీర్లు నిర్వహిస్తారని తెలిపారు. క్యాంపు ఆఫీసర్ పి.భాస్కరరావు, జి.టి.నాయుడు పర్యవేక్షణలో శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పి.లోవకుమార్, కొండబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వీర్రాజు

ప్రజారోగ్యానికి సీఎం జగన్ పెద్దపీట

- విశాఖ డెయిరీ సహకారంతో వైద్య పరికరాలు
- ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలనలో ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : ప్రజారోగ్యం దృష్ట్యా యలమంచిలి పట్టణంలో రూ.3 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న సీహెచ్‌సీ నిర్మాణ పనులును యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఆస్పత్రి నిర్మాణ వివరాలను గుత్తేదారుని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో ఆహ్లాదకర వాతావరణానికి మొక్కలు నాటాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల ఆపద్బాంధవుడు దివంగత ఆడారి తులసీరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఆనంద్ కుమార్, కుమార్తె పిళ్లా రమాకుమారిలు నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రిలో వైద్యపరికరాలను అందించడానికి ముందుకు రావడం హర్షణీయమన్నారు. అనంతరం ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే పట్టణ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందుతాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణ పనుల ఆధారంగా ఎన్ని బ్లాకుల్లో వైద్య పరికరాలు అవసరమవుతాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ ఎంపీపీ గోదెపు గోవింద్, వైఎస్సార్‌సీపీ యలమంచిలి పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, పిట్టా సత్తిబాబు, దూది నర్సింహమూర్తి, గొర్లె వెంకట్, కర్రి శివ, గంధం శివ, వైద్య బృందం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి పరిశీలనలో ఎమ్మెల్యే కన్నబాబురాజు, ఎంఎస్ఎంఈ చైర్మన్, మున్సిపల్ చైర్‌పర్సన్

ఉచిత వైద్య శిబిరం

యలమంచిలి : మండలంలోని పేట బయ్యవరం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యలమంచిలి ప్రభుత్వాస్పత్రి వైద్య బృందం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజావాణి మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ఆరోగ్యాన్ని సంరక్షించుకుని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.అరుణ్ ప్రకాష్, పి.అభినయ్, కె.,ప్రసాద్, ఉపాధ్యాయులు ఎ.పాపారావు, హరిబాబు, బి.సత్యనారాయణ, పి.రవీంద్ర, వి.కృష్ణవేణి, ప్రవీణ్ కుమార్, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

ఊరెళ్లేవారు జాగ్రత్త

పాయకరావుపేట : వేసవి సెలవుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తమ ఇళ్లు దొంగతనానికి గురవకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ పి.అప్పలరాజు సూచించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే ముందు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అదే విధంగా ఇళ్ల వద్దకు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి బంగారానికి మెరుగు పెడతామని మోసగిస్తారని, జాగ్రత్తగా ఉండాలన్నారు. వేసవి కాలం సందర్భంగా ఆరు బయట నిద్రించే సమయంలో దొంగలు ఇళ్లలోకి చొరబడి విలువైన వస్తువులు దోచుకెళ్లే అవకాశాలు ఉన్నాయన్నారు. మండలంలోని గ్రామాల ప్రజల్ని, ముఖ్యంగా పట్టణవాసుల్ని అప్రమత్తం చేసేందుకు మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు.



మైక్ ద్వారా ప్రచారం చేస్తున్న పోలీసులు

నువ్వుల సాగుపై రైతులకు అవగాహన

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం, అందలాపల్లిలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం నమూనా ప్రదర్శనలో భాగంగా నువ్వుల పంటను శుక్రవారం పరిశీలించారు. బీసీటీ కేవీకే ద్వారా సరఫరా చేసిన వైఎల్ఎం–66 నువ్వుల రకం పంట సాగు తీరుని అధ్యయనం చేశారు. నువ్వులలో సమగ్ర పంటల యాజమాన్యంపై బీసీటీ శాస్త్రవేత్త శ్రీనివాసరావు రైతులకు వివరించారు. ఏవో శంకర్‌గోవింద, మహిళా అభ్యుదయ రైతులు కొణతాల రామ సత్యవతి, బుద్ధ కృష్ణారావు, బీసీటీ సామాజిక కార్యకర్త పీఏ నాయుడు, రైతులు బి.దేవి, ఎస్.పరశురాం పాల్గొన్నారు.



అందలాపల్లిలో నువ్వు పంటపై క్షేత్ర సందర్శనలో బీసీటీ కేవీకే శాస్త్రవేత్తలు

కూలి రేట్ల కోసం కార్మికుల ధర్నా

రాంబిల్లి: రసూల్ డెకర్ కంపెనీ యాజమాన్యం ముఠా కార్మికులకు కూలి రేట్లు పాత పద్ధతిలో చెల్లించకపోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము ఆక్షేపించారు. మంత్రి అమర్‌నాథ్ ఆదేశాల మేరకు కార్మిక శాఖ అధికారులు పాత పద్ధతిలో కూలి చెల్లించాలన్న ఆదేశాలను అంగీకరించిన యాజమాన్యం అమలు చేయకపోవడం దారుణమన్నారు. దీంతో ముఠా కార్మికులు శుక్రవారం మళ్లీ ధర్నాకు దిగారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.దేముడునాయుడు, కూండ్రపు సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న ముఠా కార్మికులు

పోషకాహారంతో మహిళల ఆరోగ్యం

మునగపాక : మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని గణపర్తి సర్పంచ్ చదరం నాయుడు సూచించారు. మండలంలోని గణపర్తిలో శుక్రవారం విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ మహిళలు సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ట్రస్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ సాయి చరణ్ పోషకాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థుల ఆట పాటలు, మాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, పీఎంసీ చైర్మన్ శరగడం చిన్న, ఏఎన్ఎం సంతోషి, అంగన్‌వాడీ టీచర్లు గంగాభవాని, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కలియుగ భగవాన్ చిత్రం



అనకాపల్లి సత్యనారాయణ థియేటర్ వద్ద సినిమా విడుదల సందర్భంగా మునగపాక ప్రేక్షకులు

మునగపాక : మునగపాక గ్రామానికి చెందిన వర్ధమాన దర్శకుడు డాక్టర్ కోరుకొండ గోపి దర్శకత్వంలో శుక్రవారం విడుదలైన కలియుగ భగవాన్ చిత్రం అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రం అనకాపల్లిలోని సత్యనారాయణ థియేటర్‌లో విడుదల కావడంతో మునగపాకతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రేక్షకులు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. థియేటర్ వద్ద ఉదయం నుంచి కేరింతలు కొడుతూ సందడి చేశారు. అల్లు ప్రొడక్షన్స్ ద్వారా విడుదైన ఈ చిత్రానికి మునగపాకకు చెందిన విల్లూరి జగ్గప్పారావు మాటల రచయితగా వ్యవహించారు. మునగపాక పాలేశ్వర భీమేశ్వర స్వామి ఆలయ పురోహితుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మ పూజారి పాత్రలో అద్భుతంగా నటించారని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. తమ ప్రాంతానికి చెందిన దర్శకుడు గోపి తీసిన చిత్రాన్ని తిలకించేందుకు ఆటోలు, వాహనాలపై తరలివెళ్లారు.

వామపక్ష నేతల ప్రచార భేరీ

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని అచ్యుతాపురం, మోసయ్యపేట ప్రాంతాల్లో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచార భేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు ఆర్.రాము, కర్రి అప్పారావులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతోందని విమర్శించారు. కార్పొరేట్లకు రద్దు చేసిన రుణాలను వసూలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు జి.దేమునాయుడు, ఎస్.బ్రహ్మాజీ, పీవీ శ్రీనివాసరావు, సోమునాయుడు, ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మోసయ్యపేటలో ప్రచార భేరీ నిర్వహిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు